ప్రజల సమస్యలు ఆలకించిన జిల్లా అధికారి

శిడ్లఘట్ట, జూలై 6: తాలూకా పంచాయతీ సభాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన జనస్పందన సమావేశానికి చిక్‌బళ్లాపురం జిల్లా అధికారి డాక్టర్ పీఎన్ రవీంద్ర అధ్యక్షత వహించారు. రైతులు, ప్రజలు పలు అంశాలపై వినతు లు సమర్పించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, పశుసంవర్ధక, ప్రజాపనుల శాఖలకు సంబంధించి వినతులు వచ్చాయి. ఆయా శాఖల అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారి ఆదేశించారు. జనస్పందన సమావేశంలో రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భక్తరహళ్లి ప్రతీశ్, తాలూకా అధ్యక్షుడు మునేగౌడ, కార్యదర్శి నవీనచార్య తదితరులు పాల్గొన్నారు.

బలప్రదర్శనకు సిద్ధం

- సీఎం మార్పు చర్చలకు 'అహింద' ప్రదర్శనతో సమాధానం
- ప్రత్యర్థులకు చెక్ పెట్టేలా సిద్ధరామయ్య వ్యూహం
- రంగంలోకి దిగిన అనుచరులు
- ఆగస్టులో 76 మందికి 'సిద్ధరామయ్య అహిందరత్న' పురస్కారాలు



బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తెరవెనుక రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది ముగియడం, లోక్‌సభ ఎన్నికల్లో ఆశించినన్ని స్థానాలు సాధ్యం కాకపోవడంతో అగ్రనేతలు ఇద్దరు సత్తా చాటుకునే యత్నంలో ఉన్నారు. మరో నాలుగేళ్ల తర్వాత వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలు వస్తాయోగానీ ప్రస్తుతం అధికారం తమ వద్దే ఉండాలని ఎవరికివారు రాజకీయాలు తీవ్రతరం చేస్తున్నారు. మరో ముగ్గురికి ఉపముఖ్యమంత్రి పదవులు ఇవ్వాలనే అంశంపై చర్చ జరుగుతుండగానే.. విశ్వఒక్కలిగ మహాసంస్థానం మఠాధిపతి చంద్రశేఖరస్వామిజీ ముఖ్యమంత్రి పదవిని డీకే శివకుమార్‌కు అప్పగించాలని కెంపేగౌడ జయంతిలో అభిప్రాయపడ్డం సంచలనమైంది. తర్వాత ముఖ్యమంత్రి మార్పుపై లింగాయతస్వామిజీలు ఇద్దరు ప్రస్తావించిన విషయం తెలిసిందే. మరోవైపు సిద్ధరామయ్య ఆప్తులు 'అహింద' కూటమి ముఖ్యులు నాయకత్వ మార్పు అంటే రాష్ట్రమంతటా సంచలనం తప్పదని హెచ్చరించారు. అల్పసంఖ్యాక (మైనారిటీలు), హిందుళిత (వెనుకబడిన వర్గాలు), దళిత వర్గాల కూటమి అహింద. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య జన్మదినం సందర్భంగా భారీ బహిరంగసభ ఏర్పాటు చేసి అహింద శక్తిని ప్రదర్శించేందుకు కసరత్తు ప్రారంభమైంది. కనీసం నాలుగు లక్షల మందితో సమావేశం నిర్వహించనున్నట్టు సమాచారం. సిద్ధరామయ్య వ్యతిరేకులకు పరోక్షంగా శక్తి ప్రదర్శన ద్వారా సందేశం ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఇందుకు రూపురేఖలు సిద్ధమవుతున్నట్టు సమాచారం. దాణగెరెలో మూడేళ్లకిందట సిద్ధరామోత్సవ పేరిట భారీ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తలదన్నేలా హుబ్బళ్లిలో ఆగస్టులో ఏర్పాటు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. సిద్ధరామయ్య 76వ పుట్టినరోజున 'సిద్ధరామయ్య అహిందరత్న' పేరిట 76 మంది విభిన్నరంగాల సాధకులను సత్కరించనున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జనసమీకరణ చేయడనికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. పురస్కారం ఎంపిక కమిటీ, స్వాగత కమిటీతో పాటు మరిన్ని కమిటీలు ఏర్పాటు చేశారు. గతంలో అహింద జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించిన ముఖ్యులంతా మరో రెండు రోజుల్లో సిద్ధరామయ్యను కలసి తేదీతో పాటు కార్యక్రమ వివరాలను చెప్పదలిచినట్టు సమాచారం. హుబ్బళ్లిలో ఇప్పటికే రెండు సభలు నిర్వహించారు. హుబ్బళ్లిలోనే సభ ఏర్పాటుకు పలు కారణాలు ఉన్నాయి. బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయపుర జిల్లాల్లో సిద్ధరామయ్య జన్మదినం జరిపేందుకు ముందుకొచ్చారు. సిద్ధరామయ్య జేడీఎస్‌లో ఉన్నప్పుడు దేవెగౌడతో అభిప్రాయభేదాలు ఏర్పడగా అహింద సంఘాన్ని ఏర్పాటు చేశారు. 2005లో సిద్ధరామయ్య శక్తి ప్రదర్శన హుబ్బళ్లిలోనే నిర్వహించారు. ప్రస్తుతం సీఎం స్థానం నుంచి మార్పు చేయాలనే చర్చలు సాగుతున్న తరుణంలో మరోసారి తనశక్తి చాటేందుకు హుబ్బళ్లి సరైన వేదికగా భావిస్తున్నారు. మొత్తంగా నాయకత్వ మార్పు అనే ప్రస్తావన రావడంతోనే రాష్ట్రంలో అహింద సంఘం తనశక్తిని చాటేందుకు సిద్ధమవుతోంది. 2005లో హుబ్బళ్లిలో జరిగిన అహింద సమావేశం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కలిగించింది. ఈ అహింద కూటమి ద్వారానే సిద్ధరామయ్య సీఎం స్థానం దాకా ఎదిగారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు సిద్ధరామయ్య కారకులుగా ఉన్నారు. అందుకే హుబ్బళ్లిలో సిద్ధరామయ్య జన్మదినాన్ని జరపదలిచామని అహింద కార్యాధ్యక్షుడు చంద్రశేఖర కరడికొప్ప తెలిపారు.

ముడాలో అక్రమాలు లేకుంటే...

డీసీని ఎందుకు బదిలీ చేశారు?

- కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి



బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సొంతలాభం కోసం చేసుకున్న అతిపెద్ద అవినీతి ముడాలో జరిగిన స్థలాల పంపిణీ అని, అక్కడ అక్రమాలు జరగలేదంటే జిల్లా అధికారిని ఉన్నఫళంగా ఎందుకు బదిలీ చేశారని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ప్రశ్నించారు. హుబ్బళ్లిలో శనివారం మీడియాతో మాట్లాడుతూ మైసూరు నగరాభివృద్ధి విభాగంలో అవినీతి జరిగిందని ఆరోపించారు. 2017లోనే ఈ నిర్ణయం జరిగిందని అన్నారు. సిద్ధరామయ్యకు తెలిసే ఈ అవినీతి కొనసాగిందని తెలిపారు. ముడాలో రూ. 3,800 కోట్ల అవినీతి జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ వ్యవహారం బీజేపీ పాలనవేళ జరిగిందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. 2013 నుంచి 2018వరకు మీరు ఏమీ చేయలేదంటే, ఆరోపణలు వచ్చిన వెంటనే డీసీని ఎందుకు బదిలీ చేశారని ప్రశ్నించారు. ముడాలో అవినీతిపై డీసీ ఏడాదిలో 15కు పైగా లేఖలు రాశారని తెలిపారు. ఇందులో సిద్ధరామయ్య, ఆయన కుమారుడు స్వాధీనం చేసుకున్నవే ఉన్నాయని వివరించారు. సొంతలాభం కోసమే సీఎం అవినీతికి పాల్పడ్డారని అన్నారు. ముడా అవినీతిపై సీబీఐ విచారణ కోరాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వంలో 40 శాతం కమీషన్ అంటూ ఆరోపణలు చేశారని, ఎక్కడా ఆధారాలు లేవన్నారు. కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేయగా అందుకు వారెంట్లు తీసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ముడా అవినీతిలో సీఎం పాత్ర కీలకమైనదన్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కొందరిని అరెస్టు చేశారని, ఈ కేసును పూర్తిగా మూసేసే కుట్ర సాగుతోందన్నారు. సిద్ధరామయ్య పాలనలో అభివృద్ధి లేదని, బోగస్ గ్యారెంటీల పేరిట ఏ పనులు సాగడం లేదన్నారు. లవ్‌జిహాద్‌కు సంబంధించి శ్రీరామసేన హెల్ప్‌లైన్‌కు బెదిరింపు కాల్ రావడంపై మండిపడ్డారు.

దావణగెరె డీఐజీగా రమేశ్‌బానోత్ బాధ్యతలు



డీఐజీగా బాధ్యతలు చేపడుతున్న రమేశ్‌బానోత్

బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి రమేశ్ బానోత్ దావణగెరె తూర్పు విభాగం డీఐజీగా శనివారం బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన రమేశ్ 2009 బ్యాచ్ కర్ణాటక కేడర్ ఐపీఎస్ అధికారిగా చేరారు. ప్రొబేషనరీ అధికారిగా రాయచూరులో సేవలందించారు. ఆ తర్వాత చిక్కబళ్లాపుర జిల్లాలో 2011లో ఏఎస్పీగా, 2013లో హుబ్బళ్లి-ధారవాడ డీసీపీగా కొనసాగారు. 2016లో హావేరి ఎస్పీగా, 2017లో రామనగర ఎస్పీగా సేవలందించారు. ఆ తర్వాత బెంగళూరు నగర పశ్చిమవిభాగం డీసీపీగా, సీఐడీ విభాగంలో పలు కీలక కేసులను ఛేదించడంలో కీలకంగా వ్యవహరించారు. 2022 నుంచి మైసూరు నగర పోలీస్ కమిషనర్‌గా కొనసాగిన రమేశ్‌బానోత్ డీఐజీగా దావణగెరెలో బాధ్యతలు చేపట్టారు. డీఐజీ డీకే త్యాగరాజ్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. గతంలో హావేరి జిల్లా ఎస్పీగా పనిచేసిన సందర్భంలో దావణగెరె గురించి తెలుసని, చిత్రదుర్గ, శివమొగ్గ జిల్లాల్లో శాంతిభద్రతలతోపాటు ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని రమేశ్‌బానోత్ తెలిపారు.



మహానగరపాలిక అధికారులతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న లోకాయుక్త అధికారులు

బళ్లారి నగర పాలక కార్యాలయంపై లోకాయుక్త దాడి

- ఇద్దరు అధికారుల పరారీ

బళ్లారి/ బళ్లారి రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగర పాలక కార్యాలయంలో శనివారం లోకాయుక్త అధికారులు దాడులు చేశారు. లోకాయుక్త ఎస్పీ సిద్ధరాజ్ తెలిపిన మేరకు.. నగరపాలకలో ప్రకాశ్‌రావు అనే వ్యక్తి తన లే అవుట్‌లో రోడ్ల నిర్మాణం కోసం అనుమతి కోరారు. అనుమతి ఇచ్చేందుకు అసిస్టెంట్ ఇంజనీర్ మహదేవ్, ఎఫ్‌డీఏ మహ్మద్‌గౌస్ అనే ఇద్దరు అధికారులు రూ.1.20 లక్షలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు లోకాయుక్త అధికారులను ఆశ్రయించారు. దీంతో లోకాయుక్త ఎస్పీ సూచనతో దాడులు నిర్వహించగా అప్పటికే పరారయ్యారు. దీంతో ప్రకాశ్‌రావు చేసిన ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసులు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. సీఐ రఫీక్ నేతృత్వంలో సిబ్బంది గోవిందరాజులు, నాగలింగ, శరత్ బాబు, ప్రకాష్, హనుమంతు, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

బాగల్కోటెలో 384 మంది నకిలీ డాక్టర్లు



బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బాగల్కోటె జిల్లాలో రాష్ట్రంలో ఎక్కడాలేనంత మంది నకిలీ డాక్టర్లు ఉన్నారనే అంశం వెలుగు చూసింది. బాగల్కోటె ఎస్పీ అమరనాథరెడ్డి ఇంటెలిజెన్స్ ద్వారా జరిపిన సర్వేలో ఏకంగా 384 మంది నకిలీ డాక్టర్లు జిల్లాలో ఉన్నట్టు గుర్తించారు. స్కానింగ్ సెంటర్లలో ఆడశిశువులను గుర్తించి భ్రూణ హత్యలకు పాల్పడుతున్న ముఠాను తెలుసుకునే ప్రయత్నంలో పోలీసులు నిరంతరంగా జిల్లాలో విచారించారు. ఇందులో 384 మంది డాక్టర్లు నకిలీలుగా తేలింది. వీరంతా ఎస్‌ఎస్‌ఎల్‌సీ, పీయూసీ, బీఏ, బీకామ్, టీసీహెచ్, ఐటీఐ చదివి డాక్టర్లు చలామణి అవుతున్నట్టు గుర్తించారు. గర్భస్రావం చేసి మహిళ మృతికి కారణమై నకిలీ డాక్టర్ కవిత బాడనవర చదివింది పీయూ ద్వితీయ సంవత్సరం మాత్రమేనని విచారణలో వెల్లడయింది. ప్రస్తుతం ఆమెను అరెస్టు చేశారు. ఆమె పనిచేస్తున్న సురేఖ చరకి నకిలీ ఆసుపత్రిపైనా దాడి చేశారు. జూన్ 18న అధికారులు ఆసుపత్రితోపాటు ఆమె ఇంటిపైనా దాడులు సాగించారు. గర్భస్రావానికి ఉపయోగించే మాత్రలు, టానిక్‌లు, నిద్రమాత్రలు, గ్లోవ్స్, స్టెతస్కోప్, ఇంజెక్షన్లతోపాటు పలు ఎలక్ట్రానిక్ వస్తువులను గుర్తించారు. కవితను అరెస్టు చేశాక తాలూకాలవారిగా వైద్యం చేస్తున్నవారి వివరాలు సేకరించారు. జమఖండి తాలూకా సావలగి పరిధిలో 60 మంది నకిలీ డాక్టర్లను గుర్తించారు. బీలగి పోలీస్‌స్టేషన్ పరిధిలో 39 మంది, ముధోళ పోలీస్‌స్టేషన్ పరిధిలో 37 మంది, కళాదగి పోలీస్ స్టేషన్ పరిధిలో 29 మంది ఉండగా 50మందికి పైగా బీఏఎంఎస్ కోర్సు చేసి అలోపతి చికిత్సలు చేస్తున్నట్టు గుర్తించారు. నకిలీ డాక్టర్లకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో పంపినట్టు సమాచారం.

మహానగరాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

బెంగళూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పది మహానగరాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మహాత్మాగాంధీ నగర వికాస యోజన రెండో విడత ద్వారా రూ.2వేల కోట్లు కేటాయించనుంది. రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత మహానగర పాలికెలకు రూ.150 కోట్ల చొప్పున ఖర్చు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం యూఐడీఎఫ్ నుంచి రుణం తీసుకోవాలని నిర్ణయించింది. ఈ సంవత్సరం నుంచి రానున్న మూడేళ్ల వ్యవధిలో ప్రాజెక్టును పరిపాలనా డైరెక్టరేట్ ద్వారా టెండర్లను ఆహ్వానించనుంది. నగరాల పరిధిలో ప్రణాళికల నిర్వహణ కోసం సలహాదారులను నియమించుకుంటుందని తెలుస్తోంది. స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించింది. నగరాలను అభివృద్ధి చేయడం ద్వారా అన్ని విధాలా ప్రగతిని సాధించాలని ప్రభుత్వం యోచిస్తోంది. మహానగర పాలికెలకు ఇటీవల కొన్నేళ్లుగా అవసరమైనంత నిధులు విడుదల కాలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రతి మహానగర పాలికెకు కనీసం రూ.150 కోట్లు ఖర్చు చేయడం ద్వారా పాలికెలను బలోపేతం చేసినట్టు అవుతుందని ప్రభుత్వం నిర్ణయించింది. మహానగర పాలికెల ప్రగతిపై మూడు రోజుల కిందట జరిగిన కేబినెట్ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. మహానగర పాలికెలలో బెంగళూరు మినహాయించి మిగిలిన పాలికెలలో ఆదాయం పెంచుకోవడం కూడా లక్ష్యం కావాలని తీర్మానించారు.



స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

పోటెత్తిన భక్తులు

కిక్కిరిసిన ఖాద్రీశుడి ఆలయం

కదిరి, జూలై 6: పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు స్వామివారిని దర్శంచుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి ధ్వంజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు వసతులు ఏర్పాటు చేశారు.

బాధ్యతలు చేపట్టిన ఉపలోకాయుక్త



గవర్నర్, హైకోర్టు సీజే, సీఎం, డీసీఎంతో ఉపలోకాయుక్త వీరప్ప

బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఉపలోకాయుక్తగా జస్టిస్ బి. వీరప్ప చేత గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్ ప్రమాణం చేయించారు. శనివారం రాజ్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విభై విపిన్‌చంద్ర, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపలోకాయుక్తను గవర్నర్‌తోపాటు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.



బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న సీఎం సిద్ధరామయ్య తదితరులు

ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్‌రామ్

- సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడని, ఆహార భద్రత కోసం ఆయన చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కొనియాడారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం విధానసౌధలోని విగ్రహానికి పూలు చల్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రులు పరమేశ్వర్, మహదేవప్ప, మునియప్ప, ఆర్‌బీ తిమ్మాపుర తదితరులు పాల్గొన్నారు.

పీఈఎస్ మెడికల్ కళాశాలకు ఎన్‌ఎంసీ అనుమతులు

- ఈ ఏడాది నుంచే అకడమిక్‌కు శ్రీకారం
- నగర ప్రజలకు వైద్యం సరళీకృతం
- చాన్స్‌లర్ దొరస్వామి

బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఇంజనీరింగ్ విద్యలో ప్రథమస్థానంలో కొనసాగుతున్న పీఈఎస్ యూనివర్సిటీకి అనుబంధంగా మెడికల్ కళాశాలకు అనుమతులు దక్కాయి. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఎలక్ట్రానిక్‌సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పీఈఎస్ మెడికల్ కళాశాలకు అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎంబీబీఎస్ కోర్సులను ఈ ఏడాదే ప్రారంభించుకునేలా ఉత్తర్వులలో స్పష్టం చేసింది. ఎన్‌ఎంసీ, మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్ (ఎంఏఆర్‌బీ) ఎంబీబీఎస్ కోర్సులను ప్రారంభించేందుకు అనుమతులు ఇచ్చింది. వందమంది యూజీ విద్యార్థులకు కోర్సులు ప్రారంభించుకోవచ్చునని స్పష్టం చేసింది. 420 సాధారణ, 35 ఐసీయూ, 24 ఎమెర్జెన్సీ బెడ్ల సామర్థ్యాన్ని ఇచ్చింది. 18 యూనిట్లతోపాటు అత్యవసర విభాగాలు, బ్లడ్ బ్యాంకు, బ్లడ్ కాంపొనెంట్ విభాగాలు ఏర్పాటు చేసినట్టు 2023 ఆగస్టు 16న పరిశీలనలకు అనుగుణంగా ఉత్తర్వులు ఇచ్చింది. 22 మంది ప్రొఫెసర్లు, 29మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 44 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 42 మంది ట్యూటర్స్‌తో కలిపి అన్ని విభాగాలు అందుబాటులో ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేందుకు వెసులుబాటు లభించింది.

మరో మైలురాయి : దొరస్వామి



పీఈఎస్ విద్యాసంస్థల్లో మరో మైలురాయిని అధిగమించినట్టు చాన్స్లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి వెల్లడించారు. పీఈఎస్ మెడికల్ కళాశాలకు అనుమతులు దక్కడంపై ఆయన ప్రత్యేకంగా ప్రకటన విడుదల చేశారు. నగర ప్రజలకు వైద్యం మరింత సరళీకృతం కానుందని తెలిపారు. మూడేళ్లుగా పీఈఎస్ మెడికల్ కళాశాల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. మూడేళ్ల అహర్నిశలు కృషి చేయడంతో అనుమతులు దక్కాయన్నారు. అత్యంత సౌకర్యవంతమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను పొందేందుకు సహాయపడనుందని, వైద్యసేవలతోపాటు పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైద్యవిద్యలోనూ గుణాత్మకత పాటిస్తామన్నారు. నగర ప్రజలకు ఇదో మంచి అవకాశమని తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,593.19	1,576.71
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	25,556	193
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	190	77
సామర్థ్యం (టీఎంసీలు)	13.90	3.08

ఘనంగా జగ్జీవన్‌రామ్ వర్ధంతి



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్

బళ్లారి సిటీ, జూలై 6: భారత మాజీ ఉపప్రధాని హరిత విప్లవ మార్గదర్శకుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని నల్లచెరువు ప్రాంతంలోని జగ్జీవన్‌రామ్ భవనం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బాబు జగ్జీవన్‌రామ్ పారిశ్రామికాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ముండరిగి నాగరాజు, జిల్లా పంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప హాజరయ్యారు.

ఉత్తమ సేవలు చేసిన జగ్జీవన్

సిరుగుప్ప, జూలై 5 : మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ ఎన్నో ఉత్తమ సేవలు అందించారని డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర అన్నారు. సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఆయన భావ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సామాజికన్యాయ సాధనకు కృషి

కంప్లి, జూలై 6 : దేశంలో సామాజికన్యాయ సాధనకు గొప్ప కృషి చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. ఆయన వర్ధంతి సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రూ.20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు



13వ వార్డులో చేపడుతున్న డ్రైనేజీ పనులు

సిరుగుప్ప, జూలై 6: సిరుగుప్ప పట్టణం 13వ వార్డులో రూ.20 లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నగరసభ నిధుల కింద కాంట్రాక్టర్ అంజిరాజు ఈ పనులను చేపడుతున్నారు. ఈ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నగరసభ కమీషనర్ స్పందించి ఈ పనులకు శ్రీకారం చుట్టారు.

పాత పింఛన్లను అమలు చేయండి



తహసీల్దార్‌కు మనవిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

కంప్లి, జూలై 6: ప్రభుత్వం గుర్తించిన పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు పాత పింఛన్ల విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి అంబిగర మంజునాథ్ తెలిపారు. శనివారం తహసీల్దార్‌కు ఈ మేరకు మనవి పత్రం అందించారు. ప్రభుత్వం కొత్త పింఛన్లను రద్దు చేసి పాత పింఛన్లను అమలు చేస్తే ఉపాధ్యాయులకు అనుకూలంగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎం బసవరాజు, అమరేష్, మేలా రెడ్డి, అశోక్‌రెడ్డి, వెంకటరమణ, లింగేశ్వర, రాజు, దానేష్, రుద్రప్ప, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

తోరణగల్లులో ఎడతెరపిలేని వర్షం

తోరణగల్లు, జూలై 6: సండూరు తాలుకా వ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి వరకు వర్షం భారీగా కురిసింది. విడవకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సండూర్‌లో 32.2 మిల్లీమీటర్లు, చోర్నూరులో 7.8 మి.మీ. కురేకుప్పలో 20మి.మీ., విఠలాపురంలో 14.2 మిల్లీమీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కొత్త ఎస్పీకి సమస్యల ఛాలెంజ్

- గంజాయి, మట్కా హబ్‌గా బళ్లారి
- అడ్డూ అదుపులేని ట్రాఫిక్
- సవాలు విసురుతున్న ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు





మహిళా ఎస్పీ శోభారాణి

బళ్లారి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త ఎస్పీకి పలు సమస్యలు సవాలు విసురుతున్నాయి. గతంలో ఉన్న ఎస్పీ వీటిని ఎదుర్కొనేందుకు శతవిధాలా ప్రయత్నం చేసినా అవి నివురుగప్పిన నిప్పులా ఆయనను వెంటాడాయి. వీటితోనే ఆయనపై బదిలీ వేటుపడగా, కొత్తగా మహిళా ఎస్పీగా శోభారాణి బాధ్యతలు స్వీకరించారు.

ప్రధానంగా ఇటీవలి కాలంలో బళ్లారిలో ఉగ్రవాద కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. జిల్లా కేంద్రాన్ని ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థ స్లీపర్ జోన్‌గా సెలక్ట్ చేసుకున్నట్టుగా ఎన్ఐఏ గుర్తించింది. ఇంతకు ముందు కూడా ఎన్ఐఏ సంస్థ బళ్లారిలో ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉండే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుంది. ఆంధ్రసరిహద్దులో ఉన్న రాయదుర్గంలో ఉండే కొందరు వ్యక్తులు, అలాగే బళ్లారిలోని కౌల్‌బజార్ ప్రాంతంలో ఉండే మరి కొందరు ఐఎస్ఐఎస్ సంస్థతో సంబంధాలు కొనసాగించారని గుర్తించారు. బెంగళూరులో రామేశ్వరం కేఫ్ వద్ద బాంబు పేలుళ్ల కేసులో విచారణ చేసిన ఎన్ఐఏ సంస్థ ఐఎస్ఐఎస్‌తో సంబంధాలున్న వ్యక్తులను గుర్తించింది. వీరిలో ముగ్గురిని అరెస్టు చేసింది.

వీటితో పాటు జిల్లాలో గంజాయి, మట్కా, పేకాట, విచ్చల విడిగా రాజ్యమేలుతున్నాయి. రాష్ట్రాల సరిహద్దులో ఎక్కువగా జూదర్లు కార్యకలాపాలు నడుపుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు పేరు మోసిన వ్యక్తులు మట్కా కంపెనీలను నిర్వహిస్తున్నారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని మట్కా జోరుగా సాగుతుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయినా పోలీసులు వారిపై చర్యలు తీసుకోవడానికి జంకుతున్నారు. సిరుగుప్ప, బళ్లారి గ్రామీణ ప్రాంతంలో గంజాయి పంటను సాగు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు గంజాయి సరఫరా దారులు రైతులతో గంజాయి విత్తనం విత్తించి పంటను సాగుచేస్తున్నారు. ఇలాంటి వారిని గతంలో పోలీసులు అరెస్టు చేశారు. అయినా వారి కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇక ట్రాఫిక్ సమస్య మరింతగా ఇబ్బందిపెడుతోంది. వీటితో పాటు సవాలు విసురుతున్న అనేక సమస్యలను మహిళా ఎస్పీ అయినా సమర్థవంతంగా ఎదుర్కొంటారని జిల్లావాసులు ఆశిస్తున్నారు.

త్వరలో గృహలక్ష్మి ఖాతాల్లో డబ్బు జమ

- లబ్ధిదారులకు మంత్రి హామీ

బళ్లారి సిటీ, జూలై 6: గృహలక్ష్మి యోజన డబ్బు త్వరలో నే వస్తుందని, డీబీటీకి ఇప్పటికే నిధులు కేటాయించామని మహిళా శిశు అభివృద్ధి మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ తెలిపారు. ప్రథమంగా బళ్లారికి విచ్చేసిన ఆమెను శనివారం కార్యకర్తలు, నాయకులు ఘనంగా స్వాగతించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు గత మే నెల ప్రారంభంలో నిధులు మంజూరు చేశామని త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్డు పంపిణీ నిధుల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేయడానికి పలు కారణాలున్నాయన్నారు. దీనిపై ఆర్థిక శాఖతో చర్చించి ఎలాంటి ఆరోపణలు రాకుండా టెండర్ పిలిచామన్నారు. అంగన్‌వాడీలకు త్వరలో గుడ్లు సరఫరా చేస్తామన్నారు. తాను పార్టీ హైకమాండ్ ఏం చెబితే అది వింటానని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ ప్రారంభిం చడంపై సీఎంతో మాట్లాడి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ చదివిన అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారన్నారు. నాణ్యమైన విద్యను అందించడమే తమ లక్ష్యమని, ఏకారణం చేతనైనా అంగన్‌వాడీలను మూసివేసే ప్రసక్తేలేదన్నారు. బీజేపీ చేసే ప్రతి ఆరోపణకు సమాధానం చెప్పడం సాధ్యం కాదన్నారు. బీజేపీ హయంలో ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ అభివృద్ధికి ఎంత నిధులు కేటాయించారో చెప్పాలన్నారు. బుడా అక్రమం గురించి తనకు తెలియదన్నారు.. సతీశ్ జారకీహోళి, లక్ష్మణ సవది జిల్లాలో సీనియర్ నాయకులని, తామంతా ఒక్కటయ్యామని, ఇప్పటికే వారితో మాట్లాడామని ఎలాంటి సమస్య వచ్చినా పార్టీ చట్రంలో పరిష్కరిస్తామని చెప్పారు.



జ్యోతివెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్

నాసిరకం ఆహారం సరఫరా చేస్తే కఠిన చర్యలు

బళ్లారి తాలూకా జాలిబెంచి క్రాస్‌లో మహిళా శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా అనుబంధ పోషకాహార తయారీ యూనిట్‌ను మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూనిట్‌లో ఉత్పత్తి అవుతున్న ఆహార ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించారు. ఉత్పత్తి యూనిట్‌లోని శ్రామిక మహిళల నుండి ఆహార పదార్థాల నాణ్యత గురించి సమాచారాన్ని పొందారు. పుష్టి న్యూట్రిమిక్స్, గోధుమపిండి, మిల్క్‌పౌడర్, పసుపుపొడి వంటి ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు.

మహిళా వసతి గృహాన్ని సందర్శించిన లక్ష్మీ హెబ్బాళ్కర్

శనివారం ఉదయం నగరంలోని శాంతిదామ్ ఆవరణలో ఉన్న రాష్ట్ర మహిళా వసతి గృహాన్ని మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ సందర్శించారు. దౌర్జన్యానికి గురైన బాలికల కష్టాలను విన్నారు. మహిళా వసతి గృహంలో ఆశ్రయం పొందేందుకు గల కారణాలేమిటని మహిళలను ప్రశ్నించారు. పరిశుభ్రత ఆరోగ్యంపై దృష్టిచారించాలని మంత్రి సూచించారు. అనంతరం బళ్లారిలోని పోలీస్ స్టేషన్‌లో ప్రారంభించిన బాలల ప్రత్యేక పోలీసు విభాగాన్ని సందర్శించి బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సమీక్షించారు. నగరం స్టేడియం రోడ్డులోని వాల్మీకి భవనంలో శనివారం వికలాంగుల సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. తదనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్రిజ్‌లు, మొబైల్స్, బైసైకిళ్లు, చీరలు ఇతర సామాగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఆమె వెంట ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, బుడా అధ్యక్షులు ఆంజనేయులు తదితరులున్నారు.



ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి

చిన్నకాకర కాయకు భలే డిమాండ్

బళ్లారి సిటీ, జూలై 6: వానాకాలంలో సహజంగా పండే చిన్నకాకరకాయ(కర్చికాయ) అమ్మకాలు మార్కెట్లో జోరుగా సాగుతున్నాయి. దీనికి వినియోగదారుల నుండి కూడా చాలా డిమాండ్ ఉంది. తాలూకాలో వర్షకాలం రాకముందే పొలాన్ని సిద్ధం చేసుకున్న రైతులు నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన పొలాల్లో తొలివర్షం కురిస్తేనే చిన్నకాకర కాయ తీగ కాయ పుడుతుంది. ఈ తీగ భూమిలో సహజంగా పెరుగుతుంది. కొందరు రైతులు ఈ పంటలో కలుపు తీయడానికి నిర్లక్ష్యం వహిస్తున్నారు. రైతు మహిళలు దీని ప్రాముఖ్యతను గ్రహించి పంటను కాపాడుకుంటూ వస్తున్నారు. కాయలను సేకరించి నగరంతో పాటు అన్ని తాలూకాల్లో విక్రయిస్తున్నారు. ఒక కిలో కాకర రూ.150, ఒక శేర్ రూ.50వంతున విక్రయిస్తున్నారు. దీంతో వారి ఆదాయం కూడా పెరిగింది. ఏటా జూన్, జూలైలలో వానాకాలం సీజన్‌లో లభించే ఈ కాయకు కూరగాయల ప్రియుల నుంచి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో వ్యాపారం బాగా జరుగుతోందని వ్యాపారి బిసినళ్ళి సుంకమ్మ హర్షం వ్యక్తంచేశారు.



చిన్నకాకరను కొనుగోలు చేస్తున్న జనం

యంత్రాలతో నాటితే వరిలో అధిక దిగుబడి



యంత్రం ద్వారా వరినాట్లు వేస్తున్న దృశ్యం

కంప్లి, జూలై 6 : రైతులు యంత్రం ద్వారా వరి నాటితే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ జిల్లా సహాయ అధికారి సింగేగౌడ తెలిపారు. కంప్లి పట్టణం సన్నాపురం రోడ్డులోని కృష్ణారెడ్డి పొలంలో శనివారం యంత్రం ద్వారా వరి నాటే పద్ధతిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మస్థలం గ్రామీణాభివృద్ధి, బీసీట్రస్టు ఆధ్వర్యంలో యంత్రంతో నాటే పద్ధతిని ప్రారంభించారన్నారు. సుమారు ఐదు ఎకరాలలో వరి నాట్లు యంత్రం ద్వారా వేశారన్నారు. దీని వల్ల తక్కువ ఖర్చు అధిక లాభం వుంటాయన్నారు. ప్రతి ఒక్కరు ఈ పద్ధతిని అలవరుచుకోవాలన్నారు. నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే ఆయా దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. వారి అనుమతులను కూడా నిలుపుదల చేస్తామన్నారు. అలాగే రైతులు ప్రతి ఒక్కరు వ్యవసాయ శాఖ కేంద్రానికి వెళ్లి వారు అందించే విత్తనాలు, మందులు తీసుకుని పంటలు పండించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారి శ్రీధర్, రేణుక రాజ్, నాగరాజ, హనుమంతు, శివరాజ్, సంజీవ్ కుమార్, ధర్మస్థలం గ్రామీణాభివృద్ధి ప్రతినిధులు, పాల్గొన్నారు.

బుడాలో జరిగిన పనులపై విచారించాలి

మాజీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

బళ్లారి, జూలై 6(ఆంధ్రజ్యోతి): బళ్లారి డెవలెప్‌మెంట్ అథారిటీ(బుడా)లో ఏడాదిన్నర కాలంలో జరిగిన పనులపై విచారణ చేయాలని బుడా మాజీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుడాలో ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజాప్రయోజనాలను హరిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇంతకు ముందు లోకాయుక్త దాడులు నిర్వహించి 12 మంది అధికారులపై అవినీతి, లంచగొండితనం కింద కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. బుడాలో కమీషన్ రమేష్‌తో పాటు అక్రమాలకు పాల్పడుతున్న వారిని లోకాయుక్త అధికారులు అరెస్టు చేశారని తెలిపారు, అయితే కమీషన్ రమేష్ లోకాయుక్త అధికారులను కూడా తప్పుదారి పట్టించారని ఆరోపించారు.

బుడాలో జరిగే సమావేశంలో ఏకంగా 30. 40 అంశాలు చర్చకు తెస్తారని అందులోనూ నిబంధనల ప్రకారం సమావేశం నిర్వహించడం లేదని ఆరోపించారు. ప్రజల కోసం ఒకటి, మా కోసం ఒకటి అనే రీతిలో తీర్మానాలు చేస్తున్నారని పేర్కొన్నారు. కుడితిని సమీపంలో ఎన్ఎండీసీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ఉక్కుశాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కేవలం హుబ్లీ, ధార్వాడ, ప్రాంతాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని మిగిలిన హైద్రాబాద్ కర్ణాటకకు ప్రాదాన్యత ఇవ్వకుండా పోతన్నారని ఆరోపించారు.

జడ్పీ సీఈవోగా మహమ్మద్ అలీ అఫ్రాన్



జడ్పీ సీఈవో అలీ అక్రమ్ షాను అభినందిస్తున్న సదాశివ ప్రభు

కంప్లి, జూలై 6 : విజయనగర జిల్లా నూతన జిల్లా పంచాయతీ సీఈవోగా మహమ్మద్ అలీ అక్రమ్ షా శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వున్న సీఈవో సదా శివప్రభు బదిలీ కావడంతో అక్కడే విజయనగర ఏసీగా విధులు నిర్వహిస్తున్న నుంగర్లయ మహ్మద్ అలీ అక్రమ్ షా బాధ్యతలు తీసుకున్నారు. మణిపూర్‌కు చెందిన అక్రమ్ షా గత 12 నెలలుగా హోస్పేటలో కమీషనర్‌గా విధులు నిర్వహించారు. ప్రభుత్వం కమీషనర్ నుంచి జడ్పీసీఈవోగా బదిలీ చేశారు. శనివారం సదాశివ ప్రభు నూతన సీఈవోకు బాధ్యతలు అప్పగించారు. అక్రమ్ షా మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

బళ్లారిరూరల్, జూలై 6 : బళ్లారి వెంకటేశ్వరనగర్‌లో వెలసిన అభయాంజ నేయస్వామికి శనివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ధనుంజయ తెలిపారు. ఈ పూజల్లో బళ్లారి నగరం చుట్టుపక్కలప్రాంతాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హోసూరు జోన్

తాగునీరు వృథాకావడంపై ప్రజల ఫిర్యాదు



వృథాగా డ్రైనేజీ పాలవుతున్న తాగునీరు

హోసూరు జూలై 6 : హోసూరు కెలమంగలం రోడ్డు జొనబండ్ల బస్టాండ్ వద్ద హొగేనెకల్ వాటర్ పైపు పగిలి నీరు వృథాగా పోతోంది. దీంతో శుక్రవారం నుంచి లక్షలాది లీటర్ల తాగునీరు వృథాగా కిలోమీటర్ల మేర పారుతూ డ్రైనేజీలోకి చేరుతోంది. దీనిపై పలుమార్లు ఆ ప్రాంత వాహనదారులు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. తాగు నీటి వృథాను అరికట్టాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

హెల్మెట్లు ధరించకపోవడంవల్లనే ప్రమాదాలు

హోసూరు, (సిఫ్‌కాట్), జూలై 6 : హెల్మెట్ లేకపోవడంవలన ద్విచక్ర వాహనాల డ్రైవర్లకు జరిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించేందుకు హోసూరు జిల్లా రవాణాశాఖ కార్యాలయం తరపున బాగలూరు చెక్‌పోస్టు వద్ద రోడ్డు ప్రమాదాలపై షార్ట్ ఫిల్మ్ ప్రదర్శించారు. కృష్ణగిరి కలెక్టర్ కె.ఎం.సరయు ఉత్తర్వుల మేరకు హోసూరు ట్రాఫిక్ అధికారి దురైస్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంల్లో పాల్గొన్న వాహనదారులకు సలహాలు ఇచ్చారు. ఇందులో 200 మందికి పైగా వాహనదారులు పాల్గొని హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాల గురించి తెలుసుకున్నారు. గుగురించిగురించిగగ ఈ కార్యక్రమంల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మణిమారన్, బాగలూరు చెక్‌పోస్టు ఇన్‌స్పెక్టర్ నటరాజన్, రాణి పాల్గొన్నారు.

12లోగా హాస్టళ్లలో ప్రవేశానికి దరఖాస్తులు

హోసూరు(కృష్ణగిరి) : 2024-2025 విద్యా సంవత్సరానికి కృష్ణగిరి జిల్లాలోని ఆది ద్రావిడ, గిరిజన సంక్షేమ హాస్టళ్లలో చేరాలనుకునే విద్యార్థులు సంబంధిత హాస్టల్ కీపర్ల నుంచి దరఖాస్తులను పొందవచ్చని జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు తెలిపారు.

12వ తేదీ సాయంత్రం 6 గంటలకు వీటిని జిల్లా ఆది ద్రావిడ సంక్షేమ అధికారి హాస్టల్ వారీగా పరిశీలిస్తారన్నారు. తల్లి తండ్రుల వార్షిక ఆదాయం రూ.2 లక్షల 50 వేలు మించకూడదని, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను సలహా కమిటీ ఎంపిక చేస్తుందన్నారు. విద్యార్థులు ఆలస్యం చేయకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

సంఘ వ్యతిరేకులే హత్య చేశారని నిరసన

హోసూరు, జూలై 6 : హోసూరు రాంనగర్ అన్నా విగ్రహం దగ్గర బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ చిత్రపటానికి లిబరేషన్ టైగర్స్ ఆఫ్ ఇండియా సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను శనివారం చెన్నైలో సంఘ వ్యతిరే కులు హత్య చేశారని పేర్కొంటూ ఈ మరణకాండకు నిరసనగా శనివారం హోసూరులోని రాంనగర్ అన్నా విగ్రహం వద్ద లిబరేషన్ టైగర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్మ్‌స్ట్రాంగ్ చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సెంతమిళ్, ఇళయరాజా, సూర్యవళవన్, మారప్ప, రాజగోపాల్, వినోద్‌కుమార్, తోపయ్య, అబయ్య, తదితరులు పాల్గొన్నారు.



బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడి చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రాయచూరు జిల్లా అధికారిగా సతీశ్

రాయచూరు, జూలై 6 : నూతన జిల్లాధికారిగా కే సతీశ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళుతున్న జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ ఆయనకు పుష్పం ఇచ్చి స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. అనంతరం మాట్లాడిన నూతన జిల్లాధికారి కే సతీశ్, జిల్లా అభివృద్ధి కోసం నిబద్ధతతో పని చేస్తానన్నారు. గతంలో ఇక్కడ పని చేసిన జిల్లాధికారులు చూపిన మార్గంలోనే కొత్త పథకాలకు శ్రీకారం చుడతామన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలకు తొలి ప్రాధాన్యతనిస్తానన్న నూతన జిల్లాధికారి విద్యాభివృద్ధితోనే పురోగతి సాధ్యమని ఆ దిశగా గుణాత్మక విద్యనందేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. దీంతో పాటు మానవ వనరుల కేంద్రంగా ఉన్న రాయచూరు జిల్లాలో పెట్టుబడులను ఆకర్షించడం ఇతరత్ర ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన పై దృష్టి సారిస్తామన్నారు. కొత్తగా అందుబాటులోకి రానున్న ఎయిర్ పోర్ట్‌తో పాటు రైల్వే రోడ్డు రవాణ సౌకర్యాలు మెండుగా ఉన్నందున వాటని సద్వినియోగం చేసుకునేలా కొత్తగా ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు.



కొత్త డీసీని స్వాగతిస్తున్న డీసీ చంద్రశేఖర్

వసతి పాఠశాల విద్యార్థులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

రాయచూరు, జూలై 6 : మాన్వి పట్టణంలోగల మురార్జీదేశాయి వసతి పాఠశాలకు చెందిన విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం రాత్రి భోజనం అనంతరం అర్ధరాత్రి వేళ విద్యార్థుల్లో దాదాపు 29 మందికి పైగా కడుపునొప్పి, వికారంతో బాధపడగా సిబ్బంది వెంటనే అప్రమత్తమై వారిని మాన్విలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అంతకు పూర్వం హాస్టల్‌కు చెందిన నీటిట్యాంక్‌ను శుద్ధి చేసిన సందర్భంగా బ్లీచింగ్ పౌడర్‌ను ఎక్కువగా వినియోగించడం వల్లే ఈ అస్వస్థత ఎదురైనట్లు అధికారులు గుర్తించారు. బ్లీచింగ్‌ను మోతాదుకు మించి వినియోగించడంతో అందుకు సంబంధించిన రసాయనాలు నీళ్లల్లో మిగిలిపోవడం వల్ల ఆ నీటితో ఉండిన వంటలు అస్వస్థతకు కారణమైనట్లు శనివారం అధికారులు, వైద్యులు నిర్ధారించారు. కాగా విద్యార్థులకు ఎలాంటి ప్రాణాపాయం లేదని అందరూ ఆరోగ్యంగానే ఉన్నారని పూర్తి స్వస్థత చేకూరిన అనంతరం వారిని డిస్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి (జయంతి)



'కళాప్రపూర్ణ' గ్రహీత మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి 1914 జూలై 7న గుంటూరు జిల్లా లింగాయపాలెంలో జన్మించారు. 15వ యేట స్వాతంత్ర్యోద్యమంలో అడుగుపెట్టి అనంతరం కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, క్విట్ ఇండియా ఉద్యమంలోనూ పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం నిజాం నవాబుకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. తదుపరి మిత్రుడు కేవీస్ ప్రకాశరావు ప్రోత్సాహంతో సినీ రంగంలోకి ప్రవేశించారు. ఎన్టీఆర్‌తో కలసి ఆయన సుమారు 150 చిత్రాల్లో నటించారు. పౌరాణిక చిత్రాలతో పేరొందారు. తన ఉన్నతికి కారణమైన నాటక, జానపద రంగాన్ని విస్మరించలేదాయన. 'ఎన్టీఆర్ ఆత్మగౌరవ పురస్కారం' ఇతర అవార్డులు పొందారు. 2011 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

దిలీప్‌కుమార్ (వర్ధంతి)



'పద్మవిభూషణ్' దిలీప్‌కుమార్ 1922 డిసెంబరు 11న ప్రస్తుత పాకిస్థాన్‌లోని పెషావర్‌లో జన్మించారు. ఆయన అసలు పేరు మొహమ్మద్ యూసుఫ్ ఖాన్. సినిమాల కోసం పేరును మార్చుకున్నారు. హిందీ సినీ రంగంలో ట్రాజెడీ కింగ్‌గా పేరొందారు. 'ది ఫస్ట్ ఖాన్ ఆఫ్ బాలీవుడ్'గా గుర్తింపు పొందారు. అత్యధిక పురస్కారాలు పొందిన భారతీయ నటుడిగా గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించారు. ఏకంగా ఎనిమిదిసార్లు ఫిలింఫేర్ పురస్కారం అందుకున్నారు. పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం పొందారు. కాగా రాజ్యసభ సభ్యుడిగా 2000 నుంచి 2006వరకు కొనసాగారు. 98వ ఏట 2021 జూలై 7న కన్నుమూశారు.

నేమని సోమయాజులు (పుట్టినరోజు)



'జలతరంగ కళాప్రవీణ' గ్రహీత నేమని సోమయాజులు 1950 జూలై 7న శ్రీకాకుళంలో జన్మించారు. తెలుగు రాష్ట్రాలలో ఏకైక జలతరంగ్ కళాకారుడిగా పేరొందారు. జల తరంగ్ వాదనలో శాస్త్రీయ సంగీతం పలికించడం ఆయన ప్రత్యేకత. 15 కప్పులలో నీటిని నింపుతారు. రాగాలకు అనుగుణంగా కప్పులలోని నీటిమట్టం మారుతూ ఉంటుంది. మృదంగం, ఘటంలోనూ సిద్ధహస్తులు. ఆలిండియా రేడియోలో 'ఏ' గ్రేడ్ ఘటం కళాకరులు. ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చి పలు అవార్డులు పొందారు.

జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు (పుట్టినరోజు)




పేరడీలతో పేరొందిన ప్రముఖ తెలుగు కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు 1959 జూలై 7న విజయవాడలో జన్మించారు. సినీ గేయ రచయితగా పేరొందారు. 600కుపైగా పాటలు రాశారు. తెలుగు అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు. ప్రత్యేకించి పేరడీలు రాయడంలో ప్రసిద్ధులు. బాపు దర్శకత్వంలోని 'శ్రీరామ రాజ్యం' సినిమా లోని పాటలకు 'ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ గేయ రచయిత' పురస్కారం పొందారు. శ్రీశ్రీగారి మహాప్రస్థానం, జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి పుష్పవిలాపం వంటి వాటికి పేరడీలు రాశారు. తనికెళ్ళ భరణి దర్శకత్వంలోని 'మిథునం' సినిమాకు రాసిన కాఫీదండకం ఎంతో పేరొందింది. 2005లో 'పెళ్ళాం పిచ్చోడు' సినిమాకు దర్శకత్వం వహించి నంది అవార్డు అందుకున్నారు.

కైలాష్ ఖేర్ (పుట్టినరోజు)



నేపథ్య గాయకుడు 'పద్మశ్రీ' గ్రహీత కైలాష్ ఖేర్ 1973 జూలై 7న మీరట్‌లో జన్మించారు. స్వరకర్తగా, సంగీత దర్శకుడిగా జానపదం, సూఫీ లలో తన ప్రత్యేకత చాటుకున్నారు. గజల్, సూఫీ, ఖవ్వాళీ, జానపద గేయాలాపన ఆయన ప్రత్యేకత. 20కుపైగా భాషలలో 500కుపైగా పాటలు పాడారు. హిందీలో వెయ్యికి పైగా పాటలను రేడియో, బుల్లితెర ప్రకటనల కోసం పాడారు. తెలుగులో పరుగు, అరుంధతి, ఆకాశమంత సినిమాల్లో పాడారు. ప్రైవేట్ ఆల్బమ్స్ రూపొందించారు. ఫిల్మ్‌ఫేర్, నంది, స్టార్ స్క్రీన్ అవార్డ్స్ అందుకున్నారు.

ఎంఎస్ ధోని (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత ఎంఎస్ ధోని 1981 జూలై 7న రజపుత్ కుటుంబంలో జన్మించారు. ఇండియన్ క్రికెట్‌లో వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్, కేప్టెన్‌గా తనదైన రికార్డును సృష్టించారు. ఆయన కెప్టెన్సీలో 2007లో ఐసీసీ వరల్డ్ ట్వంటీ-20, 2010, 2016లో ఏసియా కప్, 2011 ఐసీసీ క్రికెట్ వరల్డ్‌కప్, 2013 ఐసీసీ వరల్డ్ చాంపియన్ ట్రోఫీలు లభించాయి. 10వేల కంటే ఎక్కువ పరుగులలోనూ, వన్డేలలో 150కుపైగా వికెట్‌లు తీసిన ఘనత ఆయనది. రాజీవ్ ఖేల్‌రత్న, పద్మశ్రీ వంటి ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. ఇండియన్ టెరిటోరియల్ ఆర్మీ ఆయనకు 'లెఫ్టినెంట్ కల్నల్'గా గౌరవ హోదా కల్పించింది. 2020లో క్రికెట్‌కు గుడ్‌బై చెప్పారు.

డెంగీ నియంత్రణపై ప్రత్యేక జాతా

విజయపుర, జూలై 6: వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమలు ప్రబలి డెంగీ జ్వరాలు అధికమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం కల్పించేలా పురసభ, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక జాతా నిర్వహించారు. పురసభ ఆవరణలో ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. దోమల నియంత్రణకు పాటించాల్సిన విధానాలను వివరించారు. నీటి నిల్వ ప్రదేశాల్లో దోమలు పెరగకుండా ఉండాలని సూచించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో స్వచ్ఛత పాటించాలన్నారు. పురసభ సభ్యుడు బైరేగౌడ, ప్రధానోపాధ్యాయుడు మనోహర్, పురసభ ముఖ్యాధికారి సంతోష్ కుమార్, ఆరోగ్య అధికారి లావణ్య, రెవెన్యూ అధికారి చంద్రు, పర్యావరణ ఇంజనీర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్తును రూపొందించుకోవాలి

» నటి రాధికా నారాయణ్

బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ భవిష్యత్తును చదువుకునే వేళే రూపొందించుకోవాలని ప్రముఖ నటి రాధికా నారాయణ్ అభిప్రాయపడ్డారు. యలహంక కోగిలు మెయిన్‌రోడ్డులోని ఆదిత్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో 'ఆదిత్య సంబరం' పేరిట వ్యవస్థాపక దినోత్సవాన్ని జరిపారు. ముఖ్యఅతిథిగా రంగి తరంగ ఫేం నటి రాధికా నారాయణ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సాంకేతిక యుగంలో ప్రపంచస్థాయిలో పోటీ పడేలా చదవాలన్నారు. ప్రపంచం కుగ్రామమైందని అందుకు తగ్గట్టుగానే ఏ రంగంలోనైనా అవకాశాలు సాధ్యమవుతున్నాయన్నారు. చదువు, సంస్కారం, ఉన్నతమైన ఆలోచనలను ప్రతి విద్యార్థి కలిగి ఉండాలన్నారు. సమాజ అభివృద్ధికి కొంతమేర పాటుపడాలన్నారు. ఆదిత్య గ్రూప్ సంస్థల చైర్మన్ డాక్టర్ బీపీ విశ్వనాథ్ మాట్లాడుతూ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, ఫార్మసీ, నర్సింగ్, మేనేజిమెంట్, ఫిజియోథెరపీతోపాటు మెడికల్ కోర్సులు తమ సంస్థలో ఉన్నాయన్నారు. ప్రాథమిక నుంచి పీజీ వరకు ఆదిత్య గుణాత్మకతకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఫౌండర్ విశ్వనాథ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సంస్థ సిబ్బంది లఘు వీడియోను విడుదల చేశారు. సంస్థలో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు ప్రియా విశ్వనాథ్, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



నటి రాధికా నారాయణ్ తదితరులు

విద్యార్థులు నృత్య, సంగీత, ఫ్యాషన్‌షోలో భాగస్వామ్యులు కాగా సరిగమప ఫేం సమన్వి రై, డీజే సుభాష్‌లు సంగీత కార్యక్రమాన్ని అందించారు.

చెన్నపట్టణ నుంచి అనసూయ పోటీ చేయడం లేదు

» ఎంపీ డాక్టర్ మంజునాథ్

బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చెన్నపట్టణ శాసనసభ స్థానం ఉప ఎన్నికల్లో తన భార్య అనసూయ పోటీ చేయడం లేదని బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ స్పష్టం చేశారు. వందకు వందశాతం అనసూయ రాజకీయాల్లోకి వచ్చేది ఉండదని తేల్చి చెప్పారు. శనివారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల నాలుగైదు రోజులుగా అనసూయ పోటీ చేసే విషయమై ప్రచారం సాగుతోందన్నారు. ఆ స్థానం నుంచి అనసూయ అన్న కుమారస్వామి సొంత నియోజకవర్గమే అయినా పోటీ చేసే ఆలోచన లేదన్నారు. కేవలం మీడియాలో మాత్రమే ప్రచారం అవుతోందన్నారు.

డెంగీ తీవ్రం...

మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

రాష్ట్రంలో డెంగీ తీవ్రమవుతోం దని మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డాక్టర్ మంజునాథ్ డిమాండ్ చేశారు. డెంగీ కేసులు రోజువారీ



ఎంపీ డాక్టర్ మంజునాథ్

పెరిగిపోతున్నాయన్నారు. డెంగీ జ్వరంతో అడ్మిట్ అయితే కోవిడ్ వేళ అందించిన తరహాలోనే ఉచిత చికిత్సలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. డెంగీ జ్వరం నియంత్రణ అంటే దోమల నివారణ అని తద్వారానే జ్వరాలు తగ్గుతాయన్నారు. డెంగీ నియంత్రణలోకి వస్తే చికున్‌గున్యా, జింకా వైరస్‌లు రావచ్చునని అందుకే దోమల నివారణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీకి నికరమైన చికిత్స అనేది లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు.

సమాజంలో మార్పు కోసం పనిచేయాలి



డాక్టర్ బీడీ పటేల్‌ను సత్కరిస్తున్న మాజీ జస్టిస్ సంతోష్‌హెగ్డే

» మానవ ట్రస్టు పురస్కారాల ప్రదానంలో జస్టిస్ సంతోష్‌హెగ్డే

బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వృత్తి వ్యాపారం, ఉద్యోగం ఏదైనా తనవంతు సమాజంలో మార్పుకోసం పనిచేయాలని అప్పుడే జీవితానికి అర్థం ఉంటుందని మాజీ లోకాయుక్త జస్టిస్ సంతోష్‌హెగ్డే అభిప్రాయపడ్డారు. మానవ ట్రస్టు ఆధ్వర్యంలో విభిన్నరంగాల సాధకులకు ప్రత్యేక పురస్కారాలు ప్రదానం చేశారు. బెంగళూరులో ఒకప్పటి ప్రముఖ పారిశ్రామికవేత్త రాజేంద్రకులకర్ణి దివ్యాంగులకోసం విద్యారణ్యపురలో ప్రత్యేక సంస్థను 'మానవ' పేరిట కొనసాగిస్తున్నారు. ట్రస్టు ద్వారా సమాజంలో సాధకులకు రెండేళ్లకోసారి ఆత్మీయ సత్కారం చేస్తారు. వారికి మానవరత్న పేరిట పురస్కారాలు ప్రదానం చేస్తారు. ఇటీవల నగరంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ హోమియోవైద్యులు బీడీ పటేల్, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగానికి చెందిన డాక్టర్ ఎస్ సోమనాథ్, పర్యావరణ నిపుణులు డాక్టర్ వామనాచార్య, సామాజిక సేవలో వాసుదేవ శర్మ, ఆర్ట్ అండ్ కల్చర్ విభాగంలో డాక్టర్ నిర్మలా ఎలిగార్, రొటేరియన్ జయరామన్, మీడియా రంగంలో రవీంద్రభట్‌లకు సత్కరించారు. రాజేంద్ర కులకర్ణి మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా తమవంతు సమాజానికి సేవ చేయాలనే దివ్యాంగులకోసం విద్యారణ్యపురలో ప్రత్యేక సంస్థను కొనసాగిస్తున్నా మన్నారు. దివ్యాంగులకు విద్య, పేద మహిళలకు ఆదాయం పొందేలాంటి శిక్షణలు, హెచ్ఐవీ బాధితులకు వైద్యసేవలు, వృద్ధులకు రక్షణా చర్యలు, పర్యావరణ పెంపుకోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యువత, స్వయం సహాయకసంఘాల ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. గ్రామీణ ప్రదేశాలలో నాలెడ్జ్ సెంటర్‌లను రూపొందించడమే లక్ష్యమన్నారు. డాక్టర్ పటేల్ గవర్నమెంట్ హోమియోపతి మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గాను, తమిళనాడులో హోమియో మెడికల్ కళాశాల డీన్, డైరెక్టర్‌గాను వ్యవహరించారు. 1973 నుంచి బోధన, హోమియోపతి ప్రాక్టీస్ చేస్తున్నారు. ఉచిత వైద్య శిబిరాలను ఆయన కొనసాగిస్తున్నారు. 12 భాషల్లో అనర్గళంగా మాట్లాడుతూ అన్ని ప్రాంతాల ప్రజలకు చేస్తున్న సేవలను మానవరత్న పురస్కారం ప్రదానం చేశారు.

డిజిటల్ రంగంలో భాషా ప్రాధాన్యం

బెంగళూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు ద్వారా హిందీ పరిశోధనా సమితి నిరంతరంగా సేవలందిస్తోందని డిజిటల్ భారత్‌లో ఫిన్‌టెక్ ప్రచారంలో భారతీయభాషలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు కేంద్రప్రభుత్వ రాజభాషా విభాగం అంశులి ఆర్య అభిప్రాయపడ్డారు. కెనరాబ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్‌చంద్ర ఆధ్వర్యంలో ఇటీవల గుర్‌గావ్‌లో అఖిల భారతీయ సదస్సు జరిగింది. ఈమేరకు బెంగళూరులో కెనరాబ్యాంకు ప్రధాన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. అగ్రికల్చర్ బ్యాంకింగ్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ జైకిష్, రిజర్వుబ్యాంకు జనరల్ మేనేజర్ అరవింద కుమార్ చతుర్వేది, ధర్మబీర్ తోపాటు ప్రముఖులు పాల్గొన్నారు. అంశులి ఆర్య మాట్లాడుతూ హిందీతోపాటు ఇతర భాషల్లోనూ సాంకేతికంగా పనిచేయడం సాధ్యం కావడం సంతోషకరమన్నారు. బ్యాంకింగ్ సేవలు హిందీతోపాటు 12 ప్రాంతీయభాషల్లో ఉన్నాయన్నారు. కెనరాబ్యాంకు ఈడీ అశోక్‌చంద్ర అభిప్రాయం మేరకు ఖాతాదారుల అనుకూలం కోసం బ్యాంకులు సేవలను అందుబాటులోకి



సదస్సులో ప్రసంగిస్తున్న అంశులి ఆర్య

తెచ్చాయన్నారు. బ్యాంకు స్వసహాయ గ్రూపులకు ఆర్థిక సౌలభ్యం కల్పించేందుకు డిజిటల్ వేదిక కల్పించిందన్నారు.

రాజీ మార్గంతోనే వివాదాలు పరిష్కారం

» హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ ఎస్. దీక్షిత్



సదస్సులో న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ ఎస్. దీక్షిత్ తదితరులు

బెంగళూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గంతోనే వివాదాలను పరిష్కరించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ ఎస్. దీక్షిత్ పిలుపునిచ్చారు. సమాజంలో కొన్ని సంఘటనలతో వివాదాలు తలెత్తుతాయని, వాటిని సాధించాలనే పట్టుదలతో ముందుకెళ్లడం కంటే రాజీధోరణి కూడా ఉండాలని తెలిపారు. సౌందర్య లా కళాశాలలో వకీలర వాహిని పత్రిక సహకారంతో న్యాయ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పర్యాయ వివాదాల పరిష్కారం అనే సదస్సులో న్యాయమూర్తి పాల్గొన్నారు. వివాదాల తీర్మానాలను నమ్మకం అనే పరిధిలో వెళ్లడం ద్వారా సమాన న్యాయం పాటించాలన్నారు. దేశంలో ఎన్నో కేసులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇందుకు అడ్వకేట్లు, జడ్జిలు మాత్రమే కారణం కాదని తెలిపారు. పెరుగుతున్న జనాభా, అందుకు తగ్గట్టుగా వివాదాలు, మనస్తాపాలు ఉన్నాయన్నారు. వివాదంపై కిందిస్థాయి నుంచి పై స్థాయి కోర్టుదాకా వెళ్లడం వల్ల ఏళ్ల తరబడి కాలయాపన జరుగుతోందన్నారు. కేసుల పరిష్కారం కాకుండా జాప్యమవుతోందన్నారు. వివాదాన్ని ఒక పరిణితిలో పరిష్కరించుకోవడం అవసరమన్నారు. అందుకు న్యాయవాదులు తమ కక్షిదారులకు నచ్చచెప్పి రాజీ ధోరణితో పరిష్కరించుకునేలా సహకరించాలన్నారు. జీవితంలో ప్రధానంగా న్యాయవాద వృత్తిలో తమ అభ్యున్నతిని పెంచుకోవాలన్నారు. చట్టాల నిబంధనలకు అనుగుణంగా కోర్టులో వివాదాలు పరిష్కారమవుతాయన్నారు. సమాచారం, జ్ఞానం, చాణక్యత పట్ల ప్రతి ఒక్కరికి స్పష్టత ఉండాలని, మన జీవనం కేవలం సమాచార సేకరణకు మాత్రమే కాదని, జ్ఞానంగా మార్పు చేసుకోవడం ద్వారా అనుకున్న లక్ష్యాలు చేరుకోవచ్చు అన్నారు. ఇందుకు ఉదాహరణగా పలువురు రచయితల వ్యాఖ్యానాలను వివరించారు. వకీలర వాహిని పత్రిక ఎడిటర్ డాక్టర్ బీఎం హెగ్డే మాట్లాడుతూ గెలిచినవాడు ఓడినట్టేనని, ఓడినవాడు చచ్చినట్టే అనే నానుడి ఉందన్నారు. ఎటువంటి వివాదమైనా ఇరువురికి సమాధానం కలిగించే వ్యవస్థ పెరగాల్సి ఉందన్నారు. ప్రపంచంలో అన్ని కోర్టులు వందమంది విశిష్టమైన న్యాయమూర్తుల జాబితాను రూపొందిస్తే జస్టిస్ కృష్ణ ఎస్. దీక్షిత్ పదిమందిలో ఒకరిగా ఉంటారని కొనియాడారు. ఇటీవలే రికార్డు స్థాయిలో కేసుల పరిష్కారంలో కూడా ఆయనదే పైచేయి అన్నారు. సౌందర్య కళాశాల చైర్మన్ సౌందర్యమంజప్ప, ట్రస్టు కీర్తనకుమార్, ప్రిన్సిపాల్ మహేశ్, లీగల్‌సెల్ క్లినిక్ ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ హనుమంతగౌడ, పత్రిక ముఖ్యులు ప్రశాంత్‌చంద్ర కనూరు తదితరులు పాల్గొన్నారు.

భారత్‌రైస్ విక్రయాల నిలిపివేత తగదు : సీఎం

బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంఆర్‌పి ధరతో కిలో 29 రూపాయల చొప్పున బియ్యం విక్రయాల నిలిపివేతపై కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేస్తామని సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. శనివారం విధానసౌధలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బియ్యం విక్రయాలను స్తంభింపచేయడంపై ఆందోళన చేస్తామన్నారు. గోడౌన్‌లలో బియ్యం ఉన్నా ఎందుకు ఇవ్వడం లేదంటే అది రాజకీయమే అన్నారు. ఎన్నికల ఉద్దేశ్యంతో భారత్ రైస్ విక్రయాలు చేశారన్నారు. ఎన్నికలు ముగిశాక నిలిపివేశారన్నారు. మా ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు కేంద్రప్రభుత్వం ఈ తరహాలో కుట్ర చేసిందన్నారు. గోడౌన్‌లలో స్టాక్ లేదంటే మేం డిమాండ్ చేసే పరిస్థితి ఉండదన్నారు. కానీ బియ్యం నిల్వలు ఉన్నా ఇవ్వడం లేదన్నారు. అన్నభాగ్య ఉచిత బియ్యం ఇవ్వాలని కేంద్రాన్ని సంప్రదించినప్పుడు గోడౌన్‌లలో భారీగా నిల్వలు ఉన్నా ఇచ్చేందుకు నిరాకరించారన్నారు. కేంద్ర ప్రభుత్వం దళితులు, పేదలు, వెనుకబడినవర్గాలకు అనుకూలంగా లేదన్నారు. మేం బియ్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నా కేంద్రప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా రాష్ట్రానికి బియ్యం ఇవ్వలేదని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

కసాపకు సదా సహకారం : ఎమ్మెల్యే

శిడ్లఘట్ట, జూలై 6: కన్నడ భాషకోసం పాటుపడుతున్న కన్నడ సాహిత్య పరిషత్‌కు సదా సహకారం ఉంటుందని ఎమ్మెల్యే మేలూరు బీఎన్ రవికుమార్ వెల్లడించారు. కసాప నూతన పదాదికారుల బాధ్యత కార్యక్రమం పట్టణంలోని నగరేశ్వర కల్యాణమండపంలో ఏర్పాటైంది. ఎమ్మెల్యే రవికుమార్ లాంఛనంగా ప్రారంభించారు. నూతన అధ్యక్షుడు పటేల్ టీ నారాయణస్వామికి కన్నడ బావుటాను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కన్నడ భాష, నేల, జల అంశాలపై కసాప సేవలు గొప్పవన్నారు. విద్య, ఆరోగ్య రంగాలలో సమగ్ర అభివృద్ధికి పాటు పడుతున్నట్టు తెలిపారు. కసాప జిల్లా అధ్యక్షుడు కోడిరంగప్ప మాట్లాడుతూ మాతృభాష కన్నడకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పొరుగున ఉండే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు వారి మాతృభాషకు ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. కన్నడ భాషకు వందల సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా కన్నడకంటే ఎక్కువగా ఆంగ్ల ఫలకాలు ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి సంస్థలు, కార్యాలయాల నిర్వాహకులకు అవగాహన కల్పించదలిచామన్నారు. పార్లమెంటులో కుమారస్వామి, సుధామూర్తిలు కన్నడలోనే ప్రమాణం చేయడం గర్వకారణమన్నారు. ఇదే సందర్భంగా



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలతో సన్మానం

ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. హెచ్‌డీ దేవేగౌడ, జయప్రకాశ్‌నారాయణ ట్రస్టు తరపున విద్యార్థులకు ప్రోత్సాహకధనం అందచేశారు. కార్యక్రమంలో కసాప తాజా మాజీ అధ్యక్షుడు అనంతకృష్ణ, జిల్లా మాజీ అధ్యక్షుడు నాగరాజు, బీఈఓ నరేంద్రకుమార్, శివశంకర్, రైతుసంఘం వెంకటస్వామి, వీరాపుర మునినంజప్ప, బెళ్ళూటి ముని కెంపణ్ణ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యావిధానం పెరగాలి

బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో సాంకేతిక విద్యావిధానం పెరగాలని మన ప్రాజెక్ట్స్ సీఎండీ కిశోర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తిప్పసంద్రలోని శారదా విద్యామందిరంలో సీఎస్ఆర్‌లో భాగంగా డిజిటల్ క్లాస్ రూంను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయినుంచే డిజిటల్ బోధనలు అందుబాటులోకి రావాల్సి ఉందన్నారు. అందుకు విద్యార్థులు కూడా సిద్ధం కావాలన్నారు. ఇంజనీరింగ్‌తోపాటు ఉన్నత విద్యా కోర్సులలో డిజిటల్ తరగతులు కీలకమవుతున్నాయన్నారు. పాఠ్యాంశాల బోధనతోపాటు ఆన్‌లైన్ తరగతులు ఉండాలన్నారు. విద్యామందిర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ఇదే సందర్భంగా విద్యార్థులతో కలసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

1.1 కిలోల బంగారం లోదుస్తుల్లో తరలింపు

» ఎయిర్‌పోర్ట్‌లో అరెస్టు

బెంగళూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): దుబాయ్ నుంచి బెంగళూరుకు ఏకంగా 1.1 కిలోల బంగారాన్ని తీసుకురాగా కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 3న దుబాయ్ నుంచి ఇకె 566 విమానం ద్వారా బెంగళూరు నగరం బొమ్మనహళ్ళి వాసి ప్రయాణించారు. టర్మినల్ 2 నుంచి బయటకు వస్తుండగా ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ విభాగం వద్ద ప్రయాణీకుడి తీరుపై కస్టమ్స్ అధికారులు అనుమానంగా భావించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. పరిశీలన చేయగా రెండు అండర్‌వేర్‌లు వేసుకుని అందులో ఓ సంచిలో 1.0925 కేజీల బంగారం ఉన్నట్టు గుర్తించారు. పేస్ట్ తరహాలో బంగారాన్ని చేసి తెల్లటి టేప్ ప్యాకెట్‌లలో అండర్‌వేర్‌లో దాచాడు. విచారణ వేళ తప్పును అంగీకరించారు. ఎమిరేట్స్ విమాన సిబ్బంది ఒకరు బంగారాన్ని తరలించేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈమేరకు ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ సిబ్బందిని సస్పెండ్ చేశారు. బుధవారం డ్యూటీలో ఉన్న ఎమిరేట్స్ సిబ్బంది అందరినీ రప్పించారు. అరెస్టు అయిన వ్యక్తి తనకు సహకరించిన ఉద్యోగిని గుర్తించి అధికారులకు తెలిపారు. ఇతను 20ఏళ్లుగా విమానయాన సంస్థలో పని చేస్తున్నట్టు సమాచారం.

సహకార సంఘానికి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి

బంగారపేట, జూలై 6: తాలూకాలోని బెంగనూరు మహిళా పాల ఉత్పత్తిదారుల సహకారసంఘంలో ముందస్తు సమాచారం లేకుండా ఎన్నికలు నిర్వహించడంపై గ్రామస్థులు మండిపడ్డారు. కొంతమంది ఎన్నికల అధికారులపై ఒత్తిడితెచ్చి ఎన్నికలు నిర్వహించారని సంఘం షేర్‌హోల్డర్ ఆశారాణి ఆరోపించారు. శనివారం సంఘం వద్ద నిరసన తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో సుమారు 98మంది గ్రామస్థులు షేర్ హోల్డర్‌లుగా ఉన్నారు. మూడు రోజులక్రితమే ఎవరికీ సమాచారం ఇవ్వకుండానే సంఘం అధ్యక్ష, సభ్యులను చేశారని శుక్రవారం డెయిరీ కార్యాలయానికి వచ్చారన్నారు. కేఎంఎఫ్‌లో పనిచేసే నటరాజ్‌ను ప్రశ్నించగా దీనిపై ఉన్నతాధికారులను అడగాలంటే దాటవేశారన్నారు. ఈ ఎన్నిక చట్టబద్ధంగా జరగలేదన్నారు. సమాచారం లేకుండా, షేర్ హోల్డర్‌లు పాల్గొనకుండా నోటీసు ఇవ్వకుండా పదాధికారులను ఎంపిక చేయడం సమంజసం కాదన్నారు. సంఘం అధ్యక్ష, పదాధికారుల కోసం మళ్లీ ఎన్నికలు జరపాలని గ్రామస్థుడు బీకే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నిన్న రాత్రి అంగన్‌వాడీ, మహిళాసంఘాల భవనంలో మహిళా పాల ఉత్పత్తిదారుల సంఘం పేరిట నిర్మాణాలు చేపట్టారని ఇదంతా గమనిస్తే రాజకీయ దురుద్దేశ్యంగా తెలుస్తోం దన్నారు. నిరసనలో మహిళా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం షేర్‌హోల్డర్‌లు రూప, పుష్పలతా, సుకన్య, లక్ష్మమ్మ, చైత్ర, నందిని, మమతా, కవితా, రుక్మమ్మ, లలితా, పార్వతమ్మ, నారాయణమ్మ, గ్రామ పంచాయతీ సభ్యులు గంగాధర, ప్రదీప్, గ్రామస్థులు కృష్ణప్ప, శాంతకుమార్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో ఆత్మవిశ్వాసం

బాగేపల్లి, జూలై 6: విద్యార్థులు ఎన్‌సీసీ వంటి కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం, నేర్చుకునే ధైర్యం పెరిగి జీవితంలో విజయాలు అందుకుంటారని యంగ్ ఇండియా స్కూల్ ముఖ్యులు డి శివణ్ణ అభిప్రాయపడ్డారు. పాఠశాల ఆవరణలో శనివారం ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రమాణపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, ఫిట్‌నెస్, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. సాహస, క్రీడా మనోభావాలు పెంచుకోవాలన్నారు. ఎన్‌సీసీలో రాణించడం ద్వారా ఉద్యోగాలు పొందడంలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో రాణించిన ఎన్‌సిసి విద్యార్థులను అభినందించారు. యలహంకలోని విద్యాశాల్వ అకాడమీలో పది రోజుల తర్ఫీదు పూర్తి చేసుకున్నారు. త్రోబాల్, తాడు లాగడం, గ్రూప్ డ్యాన్స్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

శిడ్లఘట్ట, జూలై 6: తాలూకాలోని బసవాపట్టణ గేట్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మళమాచనహళ్ళికి చెందిన గోవిందప్ప (50) మృతి చెందాడు. గ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం అతివేగంగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. శిడ్లఘట్ట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.